REGD. NO. A. 18

ఒక ప్రతి 0-20 న. పై

శుక్రవారం 8-9-61

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 33 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 36

## హైదరాబాదు లేఖ

### ★ ఎన్నికల సంఘ సమావేశానికి ముందువున్న వాతావరణం — సంజీవరెడ్డి, సత్యనారాయణ రాజు సంబంధాలు-బ్రహ్మానందరెడ్డి అవకాశాలు
### ★ పి. వి. జి. రాజు, చంద్రమౌళి ప్రకటనలు చర్యకు గురికావలసినంత ప్రమాదకరమైనవా?

ఆంధ్ర కాంగ్రెసులో గయోపాఖ్యానం సుఖాంతం కానున్నదనే వార్త కేవలం నిరాధారం కాకపోగా, బ్రహ్మానందరెడ్డిగారి రొట్టెవిరిగి నేతిలోపడే తీరుగా, ఆనందదాయకంగా పరిణమించే సూచనలు ఎక్కువగానే కన్పిస్తున్నాయి.

మంత్రి అల్లూరి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా, ఆయన అనుచరులైనవారే కొందరు ఆయన పరిపాలనా సామర్థ్యం, దక్షతలనుగురించి శంకించ నారంభించారు. అదీగాక, యీ ఆంధ్ర రాజకీయాలలోనుంచి అల్లూరిని చల్లగా తప్పించేందుకు లోపాయి కారీ ఆలోచనలు బయలుదేరాయి. అల్లూరిని మళ్ళీ రాజ్యసభకు తీసుకవెళ్ళి, కేంద్రంలో యేదో ఒక మంత్రిపదవి (అది స్టేట్ మంత్రిత్వమే కావచ్చు) యేర్పాటుచేసి, రాష్ట్ర నాయకత్వం బ్రహ్మానందరెడ్డిపరం చేయాలనే సూచనకు యీ వారం గ్రహబలం కాస్తవుతున్నది. ఎన్నికలసంఘ సమావేశం దగ్గర పడుతూన్నకొద్దీ యీ సంబంధమైన గ్రహచలనం ఆలోచనాకాలోచనకు ఎక్కువవుతున్నది.

దానికి తగినట్లుగానే కాలమాన పరిస్థితులు కూడా కలిసివస్తున్నట్లే తోస్తున్నది. ఆంధ్ర ప్రదేశ్ కు నియమితులైన అఖిలభారత కాంగ్రెస్ పరిశీలకులలో ఒకరైన కేంద్రఆహార శాఖ ఉపమంత్రి శ్రీ ఏ. ఎం. థామస్ విదేశ పర్యటనకు పోతున్నందున, అభ్యర్థుల నిర్ణయ పర్యవేక్షణాభారం అంతా శ్రీ యం. వి. కృష్ణప్పగారిమీదనే పడ్డది. ఈ ఖాళీని భర్తీ చేయాలని అథవా యెవరైనా పట్టుపట్టినా, కేంద్రఎన్నికలసంఘంఇంతలోసమావేశమయ్యే సూచన లేనందున, కాంగ్రెసు అధ్యక్షుడే ఆ ఖాళీకి మరొకరిని నియమించటం అశాస్త్రీయము కానేరదు. అందువల్లనే యీ విషయంలో యెవ్వరూ అట్టే పట్టుదలచూపక, అంతా వాదు విఫలమైన "శ్రీకృష్ణ రాయబారం" కోసమే తిరిగి యెదురు చూస్తున్నారు.

మండల, జిల్లా, రాష్ట్రసంఘాలు ఏకగ్రీవంగా గావించే సిఫారసులలో "సాధారణంగా" అఖిలభారతసంఘం జోక్యం పెట్టుకోదంటూనే ఏ స్థితిలోనైనా, "అక్రమం" జరిగిందంటే దాన్ని తొలగించి, సరిచేయుటకు అఖిలభారతసంఘం వెనుకాడదని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డిగారు లోగడనే స్పష్టపరిచారు. ఈ కొలబద్దతో చూస్తే రేపు సెలక్టు చేయవలసిన 254 మంది అసెంబ్లీ అభ్యర్థులలోనూ, క్రిందినుంచి పైదాకా, యేవంద మంది విషయంలోనో యేకగ్రీవమైన సిఫారసు జరిగివుంటుంది. జిల్లా, మండల సంఘాల స్థాయిలో ఇక వీటిని రాష్ట్రసంఘం పునఃపరిశీలనచేసి, యెన్నింటి విషయంలో పేర్లు మారుస్తుందో చూడవలసివున్నది.

వీటన్నింటి దృష్ట్యా చూచినా, యిక్కడ రాష్ట్ర ఎన్నికల సంఘంలో వ్యవహారాల తీరుచూచినా సగంమందికి పైగానే అఖిల భారతసంఘం పరంగా నిర్ణయమౌతారేమో నని తెలుస్తున్నది.

కాని యీలోగా మరో క్రొత్త ప్రయత్నం రాష్ట్రస్థాయిలో ప్రారంభమైంది. లోగడ జవహర్ లాల్ నెహ్రూ సూచించిన రాజీసూత్రం ఆధారంగా ప్రదేశ్ సంఘ అధ్యక్షులు శ్రీ కళ్యాంరాజు, ఇరువ్యందాలకు నాయకత్వం వహించే అల్లూరి, బ్రహ్మానందంగారలు ఎన్నికల సంఘసమావేశానికి ముందుగానే సమావేశమై, వీలైనంతవరకు ఒక యేకగ్రీవనిర్ణయానికివస్తే, దాన్ని ఎన్నికల సంఘంచేత ఆమోదింపచేయడానికి ముఖ్యమంత్రికూడా తోడ్పడాలనే సూత్రంపై మంతనాలు, చర్చలు, జనాంతికమూర్తిత్రయ సమావేశాలు ఆరంభమైనాయి.

ఈమూర్తిత్రయ సమావేశంలో రాజకీయ చాతుర్యం ప్రయోగించటంలో మంత్రి అల్లూరిది అందెవేసిన చేయియే అయినా, శ్రీ బ్రహ్మానందరెడ్డిగారుమాత్రం "మెండికేసరవటం" అసహజంకాదు. అదెట్లా, లోగడ ఓడిపోయిన నియోజకవర్గాల విషయంలోనైతే, శ్రీ కళ్యాంరాజు ప్రోద్బలంతో, అల్లూరికలొగ్గినా ఒగ్గవచ్చునని పిస్తున్నది. శ్రీ సంజీవరెడ్డిని కాదని ఆయనఏలిన ఆంధ్రదేశం యేమిటో యీసరికే చవిచూచిన అల్లూరి, వెనుదీసి ఆలోచించుకోవటం అబ్బురం కాదుగదా!


అదీగాక ముఖ్యమంత్రి సంజీవయ్య ఆ లోటాకాలోటా అడుగడుగు దూరమౌతున్నట్లే ఉన్నదికాని అల్లూరి నాయకత్వమును శిరోధార్యంగా పరిగణించే సూచనలు పన్నగిల్లుతున్నాయికూడా.

వీటన్నింటిదృష్ట్యా మూర్తిత్రయ సమావేశంలోనే, శ్రీ కళ్యాంరాజాగారి పరోక్ష సహకారంతో బ్రహ్మానందరెడ్డిగారిదే పైచేయి కాబోతున్నది. శ్రీ కళ్యాంరాజు కూడా వీలైనంతవరకు 'తనవారి' విషయంలో శ్రద్ధవహించి మిగతావారి విషయంలో ఒక "పడికట్టురాయి" యూనిటీఫ్రంటు సిల్పిలోనే చేసే సూచనలున్నాయి. ఇటీవల అనేక కారణాలుగా వారి వైఖరిలో మార్పు ద్యోతకమవుతున్నదికూడా.

—కొరవ 6-వ పేజీలో.

### ఎలెక్షన్ సత్యాలు

* మంత్రి లక్ష్మణ్ బాపూజీకి కాంగ్రెస్ టిక్కెట్టు యివ్వకపోవటం.
* ఆర్థిక మంత్రి బ్రహ్మానందరెడ్డికి స్వతంత్రపార్టీ జాగర్లమూడి చంద్రమౌళి పోటీ.
* బ్రహ్మానందరెడ్డిని ఓడించుటకు కాంగ్రెస్‌వాదుల 'తోడ్పాటు'
* ముఖ్యమంత్రి సంజీవయ్యకు కోడుమూరుసీటు యివ్వటం. ఆసీటులో గెలుపు కష్టసాధ్యం గావడం.
* కందుల ఓబులరెడ్డికి, కర్నూలుజిల్లా కాంగ్రెసువద్దన్నా, టిక్కెట్టుయివ్వటం.
* బూర్గుల పార్లమెంటుకు పోటీచేయటం



స్వాతంత్ర్య దినోత్సవంనాడు ఎర్రకోట మైదానంలోచేరిన లక్షలాది ప్రజలకు సందేశాన్నిస్తున్న ప్రధాని శ్రీ నెహ్రూ.

గ్రామ్సు: భారత్.

టెలిఫోన్: 44.

కమ్మని కాఫీకి - సువాసన వక్కపొడికి

రెడ్డీస్ కాఫీపొడి

భారత్ వక్కపొడి

పేరు, ప్రఖ్యాతి పొందినవి.

—: విక్రేతలు :—

పి. కోటారెడ్డి, బి. తిరుపతిరెడ్డి కంపెనీ,

ట్రంకురోడ్డు — కావలి.

# నెల్లూరుజిల్లాలో కాంగ్రెస్‌పరిశీలకుల విచారణ

## శ్రీ గోపాలరెడ్డికి సర్వత్రా సుముఖత: బాలిరెడ్డికి అనుకూలత

★

### ఏ.సి.వర్గం అంజనప్పకు, వంగల్లువర్గం నానాదాసుకు

★

### రాపూరులో ఏ. సి.కి, సర్వేపల్లిలో వంగల్లుకు అధిక సంఖ్యాకులసమర్థన

(మా ప్రత్యేక విలేఖరి)

నెల్లూరుజిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు దరఖాస్తులు చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకుగల స్థానిక బలము, ప్రజానురంజకత, వారి సేవా విశేషాలను పరిశీలించుటకు ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలసంఘంచేత నియమితులైన శ్రీ ఆర్. నాదమునిరెడ్డి, శ్రీ వెంకటకంటి వెంకటసుబ్బయ్యగారలు, యీ నెల 1,2,3, 4 తేదులలో నాల్గురోజులు, నెల్లూరుజిల్లాలోని ముఖ్యకేంద్రాలను సందర్శించి, మూడు పార్లమెంటు స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ టిక్కెట్లకోసం దరఖాస్తులు చేసిన 27 మంది అభ్యర్థులను విచారించి, వారివద్ద స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.


కాంగ్రెస్ పరిశీలకుల విచారణ 15 తేది రాపూరు అసెంబ్లీ నియోజకవర్గంతో ప్రారంభమై 4 తేది సూళ్ళూరుపేట నియోజకవర్గంతో పరిసమాప్తమైంది. దరఖాస్తుదార్లలో కొందరు విచారణ సందర్భంలో హాజరు కాలేదు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ ఉస్మాన్ అలీఖాన్, శ్రీ రేబాల దశరథరామరెడ్డి, దేవరకొండ హనుమంతరావు గారలు హాజరుకాలేదు. ఈశ్వరవాక వేణుగోపాలరెడ్డిగారు తన దరఖాస్తును వుపసంహరించుకున్నారు.

ఈ విచారణ సందర్భంలో కాంగ్రెస్‌లోని ముఠాల బలప్రదర్శనం ప్రస్ఫుటంగా కనుపించింది. దీని తీవ్రత సర్వేపల్లి, సూళ్లూరుపేట నియోజకవర్గాలలో బాగా ప్రదర్శితమైనది. దక్షిణ పార్లమెంటు స్థానానికి సంబంధించి ఏ.సి.వర్గం అంజనప్పను, వంగల్లు కోదండరామరెడ్డి వర్గం నానాదాసును బలపరచినవి.

కేంద్రమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారికి, శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారికి మాత్రం సర్వత్రా అనుకూలత కనుపించింది. ఒక్క పంచాయతీ అధ్యక్షుడిచేత గాని, ఒక మండల కాంగ్రెస్ సభ్యునిచేత గాని సాక్ష్యం చెప్పించుకోలేకపోయిన కాంగ్రెస్ దరఖాస్తుదార్లుకూడా వుండడం, పరిశీలకుల విచారణలో ఒక విశేషం.

పరిస్తుత శాసన సభ్యులలో కొందరు

—తరువాయి 7-వ పేజీలో







కమ్యూనిస్టుపార్టీ—స్వతంత్రపార్టీలమధ్య ఎలక్షన్ సర్దుబాట్లు జరుగుతున్నవని వార్త

### "నాబలాన్ని ఏనాడైనా నిరూపించుకోగలను"

#### —శ్రీ వంగల్లు కోదండరామరెడ్డి ప్రకటన

శాసన సభ్యుడు శ్రీ వంగల్లు కోదండరామరెడ్డి ఈక్రింది ప్రకటన చేస్తున్నారు—

"సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లిగూడూరు, వెంకటాచలం సమితులలోని 77 మంది పంచాయతీ అధ్యక్షులలో 11మంది హాజరు కాలేదు; ఒకరు తటస్థులు. మిగిలిన 65 మంది పరిశీలకులముందు హాజరైనారు. వీరిలో 48 మంది నన్ను సమర్థించుచు స్వయముగా పరిశీలకులచేతికి కాగితముల నిచ్చిరి. 17మంది నా ప్రతిపక్షానికి చెప్పిరి. ఈసక్రమ వ్యవహారమును శంకించిన ఎడల, మరల పరిశీలకులు వాజ్మూలములు తీసుకొదలచిన నేను సిద్ధముగానున్నాను. నా బలమును ఏనాడైనను నిరూపించుకొగలనని తెలియజేయుచున్నాను."

—

## ఎలక్షన్ సన్నాహాలు

★ కాంగ్రెస్ భవిష్యత్తును అంధకారంజేస్తున్న జిల్లాకాంగ్రెస్‌సంఘాల ముఠావైఖరులు

★ కర్నూలులో మాజీమంత్రికి, శాసనసభపార్టీ కార్యదర్శికి సీట్ల నిరాకరణ

★ శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరులలో పాతవారికంటే క్రొత్తవారిసంఖ్య ఎక్కువ

★ కృష్ణజిల్లాలో అందరూ పాతవారే


ఆంధ్రరాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ప్రదేశ్ కాంగ్రెస్ పరిశీలకుల విచారణ పూర్తి అయింది. వివిధ జిల్లాకాంగ్రెస్ సంఘాలు తమతమ జిల్లాలలో అభ్యర్థులను సూచిస్తూ తీర్మానాలు గావించాయి. జిల్లా కాంగ్రెస్‌కమిటీల సిఫారసులుజూస్తే కాంగ్రెస్ భవిష్యత్తు అంధకారంగా వుండబోతుందని భావించవలసి వస్తున్నది. జిల్లా కాంగ్రెస్ సంఘం ఏవర్గం చేతిలోవుంటే ఆవర్గంవారిని అభ్యర్థులుగా సూచించడంతప్ప, ఎదటివారికి ఏమాత్రం అవకాశమివ్వడం జరగలేదు. గతంలో కొంతవరకు ముఠాలప్రభావం వుండినా, యింత అన్యాయంలేదు. ఎదటి వర్గంలో ముఖ్యులైనవారు కొందరికైనా స్థానం చూపబడుతుండేది. కాని యిప్పుడు కాంగ్రెస్‌లోని ముఠాతత్వం పరాకాష్ఠనందింది. కాంగ్రెస్‌కు చెడుదినాలు సంప్రాప్తించి, నాయకులకు యిలాంటి విపరీతబుద్ధులు పుట్టుతున్నవి. ప్రదేశ్ ఎన్నికలసంఘంగాని, అఖిలభారత కాంగ్రెస్‌సంఘంగాని జిల్లాకాంగ్రెస్ తీర్మానాలకు విలువనిచ్చి, వారి సూచనలను యథాతథంగా ఆమోదించడమే జరిగితే, 1962 ఎన్నికలలో కాంగ్రెస్ అవకాశాలనుగూర్చి యిప్పుడే చెప్పవచ్చు.

ఇదేగాదు, పరిశీలకులు సేకరించిన సాక్ష్యం ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పలేము. అది చాలసందర్భాలలో కృత్రిమంగా, నిర్బంధంగా, అక్రమంగా కూడా జరిగింది. పంచాయతీఅధ్యక్షులు గాని, యితరసంస్థల ప్రతినిధులుగాని స్వేచ్ఛగా అభిప్రాయాలు వెలిబుచ్చడం చాల అరుదుగా కనిపించింది. ఇక మండలకాంగ్రెస్ సంఘాలు, జిల్లాకాంగ్రెస్, రాష్ట్రకాంగ్రెస్ సభ్యులు కేవలం జిల్లాకాంగ్రెస్‌సంఘాల విశ్వామిత్ర సృష్టిగాబట్టి, జిల్లాకాంగ్రెస్ ధోరణినను సరించే వారి సాక్ష్యాలు సాగినవి. అందువల్ల వీరి అభిప్రాయాలను కాంగ్రెస్‌వాదులందరి అభిప్రాయాలుగా పరిగణించుటకు వీలులేదు.

కావున ముఠాలకు అతీతంగా వ్యవహరించగలిగితే ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘంగాని, అది సాధ్యంగానప్పుడు కేంద్ర ఎన్నికలసంఘంగాని, ఆంధ్రకాంగ్రెస్ అభ్యర్థుల నిర్ణయంలో నిష్పాక్షిక పరిశీలనజరిపి, కాంగ్రెస్‌లోని అన్నివర్గాలలో అర్హులైన వారికి అవకాశం కలుగజేసి, కాంగ్రెస్ భవిష్యత్తును కొంతవరకు ఆశాజనకం గావించడం అవసరం.

ఇంతవరకు శ్రీకాకుళం, విశాఖ, కృష్ణ, కర్నూలు జిల్లాకాంగ్రెస్‌సంఘాలు తమ సిఫారసులనుచేసాయి. నెల్లూరుజిల్లా కాంగ్రెస్ సంఘంకూడా తీర్మానించిందిగాని, ప్రకటించలేదు. (దానికి సంబంధించిన వార్తలు ఈ సంచికలోనే వేరొకచోట యివ్వబడినవి) ఈ జిల్లాకాంగ్రెస్‌సంఘాల నిర్ణయాలు రాజకీయ భావిత్వాతత్త్వాలకు దారితీయదమేగాక ప్రతిపక్షాలకు ఎంతెన వుర్సాహాన్ని, బలాన్ని

—తరువాయి 12-వ పేజీలో.




## • బ్రెజిల్‌లో క్వాడ్రోస్ కాస్ట్రో అభిమానియై శిక్ష అనుభవించాడు. గౌలార్ట్ అధ్యక్షుడై నెగ్గగలడా?

## • ఇంతకూ బెర్లిన్ ఏమవుతుంది?— తూర్పు తూర్పే—పడమర పడమరే!

బ్రెజిల్‌లో అల్లరి యింకా ఆగలేదు. ఒక అధ్యక్షుడు మాయమైనాడు; ఆయన స్థానాన్ని ఆక్రమించవలసిన ఉపాధ్యక్షుడు స్వదేశంలోకి రాలేక అవల చిక్కుబడిపోయినాడు. ఈ పంక్తులు పాఠకులకందేలోపల ఈ అగమ్యగోచరావస్థ తొలగిపోవచ్చునేమో తెలియదు.

బ్రెజిల్ కెన్నెడీరాజ్యానికి క్రిందవున్న లాటిన్ అమెరికాఖండంలో ఒక ముఖ్యమైన సీమ. దీని వర్గాస్ అనే నియంతవంటివాడు పాలించి వెళ్లిన పిదప, దేశంలో రాజకీయంగా చాల అస్థిమితమైన పరిస్థితి ఏర్పడింది. ఆ దేశంలో లాసెర్డా అనే పెంకఘటాడొకడున్నాడు. వీనిధాటికాగలేక వర్గాస్ వంటి బలవంతుడు కడకని త్యజించి, ఆత్మహత్య చేసుకొన్నాడు. అది ఏడేండ్లక్రిందట జరిగింది.

మళ్లీ ఆ లాసెర్డా అనే ఆటంకమేవచ్చి, ఇప్పటిఅధ్యక్షుడు క్వాడ్రోస్ కాలికి బుద్ధి చెప్పెను. తనపరిస్థితిని ఆయన ఇట్లు వివరించుచున్నాడు: 'నాకు గిట్టని వారి కుట్రాగం పెర్గింది. ఇక నేన్ప్రభుత్వం చేయను. ఈ దేశాన్ని సంపూర్ణమైన, స్వచ్ఛమైన రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అనుభవించేట్లు చేయవలెనని శక్తివంచనలేకుండా ప్రయత్నించాను. బ్రెజిల్ బ్రెజిల్‌కే దక్కవలెనని నా సంకల్పం. అవినీతిని, అబద్ధాలను, వీరికి

—కొరవ 10-వ పేజీలో

### ఇదీ బ్రెజిల్....

దక్షిణ అమెరికా లోని పెద్దదేశం బ్రెజిల్. 32,88,050 చ.మై. విస్తీర్ణం. జనాభా 6,80,00,00 మాత్రమే. ప్రజల భాష పోర్చుగీస్. ఈ దేశం ఉత్తర దక్షిణంగా 2676 మైళ్లు, తూర్పు పడమరలు 2,694 మైళ్లు వున్నది. ఈ దేశానికి 4,889 మైళ్లు అట్లాంటిక్ సముద్రతీరం వున్నది. అమెజాన్ నది ఒక్కటే 1,700 మైళ్ల దూరం నావికాయానానుకూలం గావడమేగాక, దేశాన్ని సుసంపన్నంగావిస్తున్నది. 1808 నుండి రాజధానిగావుండిన రయొ డి జనీరో బదులు 1960 ఏప్రెల్‌లో బ్రెసిల్లా నగరం రాజధానియైనది. కాఫీ ఉత్పత్తికి బ్రెజిల్ ప్రపంచవిఖ్యాతి చెందినది. పారిశ్రామికంగా గూడా అభివృద్ధి చెందింది. వ్యాపారాది విషయాలలో అమెరికాతో సంబంధమెక్కువ. వయోజన ఓటింగుహక్కు వున్నది. ఒకసారి అధ్యక్షుడుగా ఎన్నుకోబడేవ్యక్తి 5 ఏండ్లు అధికారములో వుంటాడు. ఒకేవ్యక్తి వరుసగా రెండుసార్లు అధ్యక్షుడగుటకు వీలులేదు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యతిరేక పార్టీలు నిషేధాలు.


# కేసరి అడుగులకు

**అమ్మోనియం ఫాస్ఫేటు అమోఘంగా పనిజేయును**

కేరళ ప్రభుత్వ ఫ్యాక్టరీలో తయారైన అమ్మోనియా ఫాస్ఫేటు (అమ్మో ఫాస్) మావద్ద దొరకును. స్టాకు పరిమితంగావున్నది.

**** మరియు మావద్ద ****

**ఎముకల పిండి - ఎముకల జవ -**

**సూపర్ ఫాస్ఫేటు**

**ప్యాడీమిక్చెర్లు - పొటాష్**

**అన్నిపైర్ల తెగుళ్లు, చీడపురుగులకు మందులు**

వాటిని వుపయోగించుటకు స్ప్రేయర్లు - డస్టర్లు దొరకును:

ఆంధ్ర బోన్ మిల్లు కంపెనీ,

స్టోన్ హవుస్‌పేట (రేబాలవారిసందు) నెల్లూరు.

(ఫోన్ :: 67)




పశ్చిమ బెర్లిన్‌లోని ఒక ఆశ్రయంవద్ద గుమిగూడిన తూర్పుజర్మని కాందిశీకులు

**1980 నాటిమాట- 3**

# సత్రాభోజా-మఠానిద్రా బాపతు బైరాగిలోకం దుర్భరం!

1980 వచ్చేసరికి ప్రజలు వాడుకునే వస్తువులలో నూటికి అరవైపాళ్లు ఉచితంగా (పైసా అడగకుండా) అందరికీ (రష్యన్లందరికీ) సప్లయి కాగలవని రష్యానియంత కూడించెను. 'అన్నసత్రం' ప్రజలందరికీ ఛాయమే; రవాణా కూడా అట్లే ఉచితంగా వుంటుందట. వండని అన్నం, (వడ్డని బట్టకూడానా?) అందరికీ లభ్యమవుతుందట.

చైనావారిప్పుడే కమ్యూన్లద్వారా ఈ ధోరణి సాగించారు. అందుకనే రష్యన్లకు వారిమీద కోకంవచ్చింది. ఇక రెండు దశాబ్దాలతర్వాత కాము గ్యారంటీ చేయదలచినది ఈనాడే వీరు సమకూర్చగలధీరులైనారా?

ఈ సందర్భంలో ఒకమాట. ఒకవస్తువు తక్కువగావుంటే, దానిని జాగ్రత్తగా వాడుకోడానికి అందరు 'కలిసి మద్దలు' వేయించుకొవచ్చును. లేదా నిరుపేదలకు కలిగినవారు ధర్మం చేసేటప్పుడు అందర్నీ ఒకచోటికి పిల్చిపెడతారు. కాని, సర్వసాధారణంగా, ఎవరి అభిరుచి ప్రకారం వారు వండించుకొని తింటారు. ఎవరి యిష్టానుసారం వారు ఇతర వస్తువులను వినియోగించుకుంటారు, సేవలను పొందుతారు.

పుష్కలంగా వస్తువులుంటే సమష్టి భోజన కాలక్షేపమెందుకు? అవసరాన్నిబట్టి అందరు కలిసిన తావుననే కలిసితింటారు.

ఇంకొక సంగతి: బైరాగులవల్ల ఉత్పత్తి కాదు. శ్రమశక్తివల్లనే పదార్థాలు, సేవలు అందుతున్నవి. నాకు అన్నంపెట్టినవారికి నేనేదో ఇంకొకటని చేసిపెట్టవలెను. లేకుంటే వారు నాకు పంటలు పండించరు, దానిని మరొకరు వండించరు. అందువల్ల, సంపాదులుండే ప్రపంచంలో ఉచితంగా ఏదీ దొరకదు. దానం, ధర్మం, భిక్షం, ఉచితంగా దొరకడం అనే సంగతులు ఆధునిక యుగానికి పనికిరావు. Mutual Aid, పరస్పర సహాయం, మహాత్మా క్రొపాట్కిన్ చెప్పినట్లు, కదనరంగం ఉత్కృష్టం. అన్నసత్రాల మాంద్యాన్ని సమాజంలోనూ ప్రోత్సహించడం మంచిదికాదు.

శ్రమజీవిగా, ఆరోగ్యవంతుడై వర్ధిల్లి, స్వతంత్ర మానసంతో ఆలోచించగల శక్తి గలిగి, సంఘంలో ఎప్పటికప్పుడుత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించగల్గే మానవులుండే సమాజాన్ని మనం కాంక్షించవలెను.

మనుష్యులంటే సత్రకాయలు కారోయ్!

వస్తువులు, విజ్ఞానం పుష్కలం కాగానే సరిపోయిందా? వాటిని సద్వినియోగం చేసుకునే యోగ్యత కావద్దా?

••• పరిశీలకుడు •••

అసలిప్పుడుమాత్రం ప్రపంచంలో దరిద్రులుగా లేరా? సంపన్నులై, బలిసిన వారేగదా కయ్యానికి కాలుదువ్వేది?

దారిద్ర్యం నిర్మూలం కావలసినదే. దీని అర్థం సంపన్నులైతే జనం బుద్ధిమంతులౌతారని కాదు. ప్రపంచంలోని పీడలన్నిటికీ దారిద్ర్యం మూలకారణం అనుకోవడం పొరపాటు.

వస్తుదారిద్ర్యంకంటె బుద్ధిదారిద్ర్యం ఉపద్రవకరం. వస్తుదారిద్ర్యం పోవడానికి బుద్ధిగలవారు పనిచేస్తే, మన ప్రపంచసమస్య తీరిపోతుంది— ప్రస్తుతానికి.

—కొరవ 8-వ పేజీలో.


# చంద్రభవన్

నెల్లూరు



30 సంవత్సరములుగా నెల్లూరులో అందరి మన్నన పొందుతూ యున్న నిలకడగల

**కాఫీ భోజన హొటల్**

# ఎలక్షన్ సన్నాహాలు

(3-వ పేజీ కొరవ)

కలిగిస్తున్నవి. ఈ నిరాశాజనకమైన, నిష్పృహతో కూడిన వాతావరణంలో కాంగ్రెస్ వాదులు ఎన్నికలలో యెంతవరకు ఉత్సాహంతో పాల్గొనగలుగుతారో, పని చేయగలుగుతారో చూడవలసివున్నది. వివిధ జిల్లా కాంగ్రెస్ సంఘాల సూచనలు.

## కర్నూలుజిల్లా

ఈజిల్లా కాంగ్రెస్ సంఘం ముఖ్యమంత్రి వర్గం చేతిలోవుంది. శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య దీనికి అధ్యక్షుడు. ఈజిల్లా కాంగ్రెస్ సంఘం నిష్పక్షపాతంగా, నిర్భయంగా, నిర్మొగమాటంగా, నిర్దాక్షిణ్యంగా యూనిటీ ఫ్రంటు అభ్యర్థులను ప్రోసి చేసి, తమ ముఠా వారినిమాత్రం సూచించింది. మాజీ మంత్రి శ్రీ కందుల ఓబులరెడ్డి, శాసనసభ కాంగ్రెసుపార్టీ కార్యదర్శి శ్రీ విజయభాస్కరరెడ్డిగారలను నిరాకరించిండంటే, ఆ నిర్ణయాలు యెంత కరడుకట్టిన మూర్ఖత్వంతో జరిగినవి తెలుస్తుంది. వీరితోపాటుగా సి. పి. తిమ్మారెడ్డి, హెచ్. రామలింగారెడ్డివంటి వారికిగూడా నిరాకరింపబడినది.

శ్రీ విజయభాస్కరరెడ్డి సంజీవయ్యకు వ్యతిరేకంగా సాక్ష్యాన్ని సమీకరించి చెప్పించాడని, ఆ కక్షతో వారిపేరు సూచింపబడలేదని; ఇటు పిడతల రంగారెడ్డికి, అటు జల్లా రామిరెడ్డికి వ్యతిరేకంచేసిన ఫలితంగా శ్రీ ఓబులరెడ్డిపేరు తొలగించబడిందని వదంతి.

మొత్తం 16 స్థానాలలో నలుగురుమాత్రం పాతవారు. ఆరు సీట్లకు ఒక్కొక్కరిపేరు; నాలుగుస్థానాలకు ఒకటికంటే ఎక్కువపేర్లు సూచించబడినవి. నంద్యాలస్థానం ప్రదేశ్ ఎన్నికలసంఘ నిర్ణయానికి, ఆళ్లగడ్డ రిజర్వుడు స్థానం ముఖ్యమంత్రి నిర్ణయానికి వదలబడినవి.

అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుని అల్లునికి స్థానం (నందికొట్కూరు) యివ్వబడడం విశేషం.

## శ్రీకాకుళంజిల్లా

ఇచ్చటా కార్యవర్గంలో లుకలాపు లక్ష్మణదాసు, తెండి సూర్యన్న వర్గాలమధ్య వివాదంజరిగి, లక్ష్మణదాసే నెగ్గినట్లుంది. పార్లమెంటు మూడుస్థానాలకు అభ్యర్థులను నిర్ణయించి, వారివారి నియోజకవర్గాలలోని శాసనసభ స్థానాలకు అభ్యర్థులను సూచించే అధికారం వారికిచ్చి, వారు సూచించినపేర్లను కార్యవర్గం ఆమోదించింది.

ఇది క్రొత్తపద్ధతి.

జిల్లాలోని 20 నియోజకవర్గాలలో తొమ్మిదిమందితప్ప, తక్కిన అందరూ క్రొత్తవారు. బహుశా గతపర్యాయం లోక్‌పార్టీ అభ్యర్థులున్నచోట నియమించడంలో ఎక్కువమంది క్రొత్తవారికి అవకాశం కలిగినట్లుంది.

పార్లమెంటుకు బొబ్బిలి కుమారరాజాగారు సూచింపబడడం విశేషం.

## తూర్పు గోదావరి

శ్రీయుతులు తిరుమలరావు, బి. యస్. మూర్తి, నల్లా రెడ్డినాయుడుగారలు పార్లమెంటు అభ్యర్థులుగా సూచింపబడినారు.

భద్రాచలం ఖమ్మంమెట్టుజిల్లాకు పోగా మిగిలిన 22 శాసనసభసీట్లకు తొమ్మిదిమంది తప్ప, తక్కిన అందరూ క్రొత్తవారు. ప్రతిపక్షాలస్థానాలు 7 పోయినా, 8 మంది పాత కాంగ్రెస్ సభ్యులు, యీసారి జాబితానుండి తొలగింపబడినారు.

అభ్యర్థులుగా ఎన్నికైనవారిలో విద్యామంత్రి శ్రీ పట్టాభిరామారావు; విరమించినవారిలో శ్రీమతి వాణీరామారావు ముఖ్యులు.

## కృష్ణాజిల్లా

శ్రీ యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతనవుండే ఈ జిల్లాకాంగ్రెస్‌సంఘం పాతవారెవరికీ ఆశాభంగం కలిగించలేదు. బహుశా అందరూ ఫ్రంటువారు కావడం, జిల్లా కాంగ్రెస్ సంఘమూ ఫ్రంటుసాధనం కావడమూ దీనికి కారణమేమో!

మూడు పార్లమెంటుస్థానాల అభ్యర్థుల నిర్ణయం ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి వదలిపెట్టబడింది. శాసనసభ 17 స్థానాలలో తొమ్మిదిమంది పాతవారు, 7 మంది క్రొత్తవారు.

ఆంధ్రశాసనసభ స్పీకరు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు విజయవాడ (సౌత్) కాంగ్రెస్ అభ్యర్థికావడం విశేషం.

## విశాఖజిల్లా

20 స్థానాలలో 17 సీట్లకు అభ్యర్థులు సూచించబడినారు. ఇది యూనిటీఫ్రంటు వారి ప్రాబల్యంగల కాంగ్రెస్‌కమిటీ. అంటే పి. వి. జి. రాజాగారి పలుకుబడి పూర్తిగా పనిచేస్తుంది. ఈ కార్యవర్గం సూచించిన వారిలో 7 మంది పాతవారు, 10 మంది క్రొత్తవారు. మూడుస్థానాలు ఖరారుకాలేదు.

పి. వి. జి. తన సోషలిస్టు అనుచరులందరికీ సిఫారసు చేయించుకున్నారు.

పి. వి. జి. రాజుకు శాసనసభ స్థానం, వారి పినతండ్రి విజయానంద్‌కు పార్లమెంటు స్థానం సూచింపబడడం విశేషం.

---

## విశాఖపట్నం సబు కోర్టులో

O. S. No. 54 of 1953.

E. P. 324 of 60. E. A. 437 of 61.

పట్నాల వెంకటరమణయ్య —వాది–D. H. R–పిటీషనరు.

నిడుగొండ సత్యవతమ్మ వగైరాలు —ప్రతివాదులు–J. Ds.

C. P. C O. 21, R. 72 ప్రకారము Notice to Judgement debtors 3, 4, 7 to 10 & 12 (3) నిడుగొండ చిరంజీవిరావు (4) యీ. వరహాలు (7) మల్లారెడ్డి శితారత్నం (8) కప్పసారి సూర్యకాంతం (9) మోదపోతుల వరలక్ష్మి (10) నిడుగొండ రాజరత్నం (మై॥ గా॥) తల్లి సత్యవతమ్మ (11) యీ. అన్నపూర్ణమ్మ - సాకిన - విజయనగరం.

యీ నెంబరు వేలంలో అనగా 12–9–61 తేదీన జరుగబోయే వేలంలో డిక్రీహోల్డరుపాడు కొనుటకున్న సదరు వేలం మొత్తం తన తా॥ డిక్రీబాకీలో Setoff చేసుకొనుటకున్న పర్మిషను నిమిత్తం ఇ. ఏ. నెం 437/61 ది పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషను 3, 4, 7 to 10&12 Judgement debtors నోటీసుల నిమిత్తం 12-9-61 తేదీకి వాయిదా వేసినారు. ఆక్షేపణలున్న యెడల వాయిదానాడు సైకోర్టుకు హాజరై తెలియజేసుకోవలసినదని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

—అకెళ్ళ రామమూర్తిపంతులు,
డిక్రీహోల్డరు అడ్వకేటు.

## గూడూరు డి॥ ము॥ కోర్టులో

O. S. No. 113 of 1960.

అల్లూరు వెంకటనారాయణరెడ్డి —వాది.

T. A. కన్నయ్యనాయుడు వగైరాలు ... —ప్రతివాదులు.


T. A. కన్నయ్యనాయుడు S/o అప్పానాయుడు - లింకో ద్యాన్‌ఫ్యాక్టరి - తిరువత్తూరు - మదరాసు–19.

యీ నెంబరున వాది దావా దాఖలుచేసియున్నందున మీకు యెన్నిపర్యాయములు నోటీసు పంపినను జారీకానందున Substituted సర్వీసుద్వారా దావానోటీసునిమిత్తం 30–9–1961 తేదీకి వాయిదా వేసినారు. గనుక సదరు తేది పగలు 10 గంటలకు యీ కోర్టువారి యెదుట హాజరై ఆక్షేపణలువున్న తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

—వై. రామారావు, వాది అడ్వకేటు.


# వరద బాధితులకు

## శక్తివంచన లేకుండా సహాయము చేయండి



# ప్రధాని జాతీయ సహాయక నిధికి

## విరివిగా విరాళాలివ్వండి

మీ విరాళాలను కార్యదర్శి, ప్రధాని జాతీయ సహాయకనిధి, ప్రధానమంత్రి సెక్రటేరియట్, సౌత్‌బ్లాక్, న్యూ ఢిల్లీ అనే చిరునామాకు పంపించండి. మీరు పంపే చెక్కులమీద ప్రధాని జాతీయ సహాయకనిధికి చెల్లించవలెను, అని వ్రాయండి.


Edited, Printed and Published by N. Sree Ramamurthy at The Zamin Ryot Press, 170 Thipparajuvari Street, Nellore